క్లుప్తంగా

కామాక్షితాయికి బంగారు కాసుల హారం బహూకరణ



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయికి నెల్లూరుకు చెందిన గునపనేని శ్రీనివాసులు, అరుణమ్మ దంపతులు 8 గ్రాముల బంగారు కాసుల హారాన్ని శుక్రవారం బహూకరించారు. ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

అమ్మవారిపాళెం రోడ్డు పనులు ప్రారంభం

పొదలకూరు : అమ్మవారిపాళెం రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. సంగం రోడ్డు నుంచి అమ్మవారిపాళెం వెళ్లే రోడ్డు దెబ్బతినడంతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రూ.1.41 కోట్లు మంజూరు చేయించారు. రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ తొలుత జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నారు..

విద్యుత్ షాక్‌తో ఆవు,దూడ మృతి

వెంకటాచలం: సర్వేపల్లి సమీపంలోని యూపీఐ పాలిమర్స్ పైపుల ఫ్యాక్టరీ వద్ద విద్యుత్ షాక్‌కు గురై ఆవు, దూడ శుక్రవారం మృత్యువాత పడ్డాయి. వివరాలు..సర్వేపల్లికి చెందిన పాడి రైతు కుంకాల సుమన్ తన ఆవులను ఈదగాలి రైల్వేగేటు సమీపంలోని పొలాల్లోకి మేత కోసం తోలుకెళ్లాడు. అక్కడ యూపీఐ పాలిమర్స్ ఫ్యాక్టరీ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై ఆవు, దూడ మృత్యువాత పడ్డాయి. ఫ్యాక్టరీ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే తన ఆవు, దూడ మృతి చెందాయని, తనకు రూ.40 వేల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

స్వచ్ఛ విద్యాలయానికి కృషి చేయాలి

కొడవలూరు: స్వచ్ఛ విద్యాలయ నిర్మాణానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం టీ వెంకటేశ్వర్లు కోరారు. స్వచ్ఛత పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా వెంకన్నపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర కోసం కృషి చేద్దామంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల సహాయకురాలు జీ మాధవి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ముత్తుకూరు మండలం పంటపాళెంలో..



మనుబోలు: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



కొడవలూరు మండలం కొత్తవంగల్లులో..

ఇందుకూరుపేట: గర్భిణులు, బాలింతలు రక్తహీనతను అధిగమించేందుకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని అడిషనల్ సీడీపీఓ ఎం రాజ్యలక్ష్మి సూచించారు. పల్లిపాడు సెక్టారు పరిధిలోని నిడిముసలి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పోషకాహార వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని తయారు చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ ఎం శిరీష,అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కొడవలూరు: కొత్తవంగల్లు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహార పదార్థాల తయారీపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలు ఎస్ సుజాత, సుప్రజ, కామేశ్వరి, రాజేశ్వరి పాల్గొన్నారు.

మనుబోలు: పోషకాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పిడూరుపాళెంలో అంగన్‌వాడీలు పోషకాహారం ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ పాల్గొని తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తయారు చేసుకోవడంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు ఆకు కూరలు, తాజా పండ్లు, గుడ్లు, పాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీలు సంపూర్ణ, రాధ, ఉమామహేశ్వరి, దొరసానమ్మ, ఆశాకార్యకర్త రమ పాల్గొన్నారు.

ముత్తుకూరు: పంటపాళెం-2 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బమ్మ పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలు పోలమ్మ, మంజుల, రూత్ తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: గర్భిణులకు సామూహిక సీమంతాలు

రీ సర్వే రికార్డులను పక్కాగా నిర్వహించాలి



మనుబోలు: రీ సర్వేకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీ పూర్ణిమ సూచించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో రీ సర్వే రికార్డులను శుక్రవారం ఆమె పరిశీలించారు. అక్కంపేట, కట్టువపల్లి, పర్లపాడు, అనుపల్లిపాడు, ముద్దుమూడి, వెంకన్నపాళెం, బద్దెవోలు గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో రీ సర్వేను పక్కాగా చేపట్టాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. డీటీ శ్రీకాంత్‌రెడ్డి, సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వోలు నాగర్జునరెడ్డి, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడ పీహెచ్‌సీ తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడ పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ దయాకర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలపై వైద్యారోగ్య సిబ్బందిని ఆరాతీశారు. పీహెచ్‌సీలోని వసతులపై గర్భిణులకు అవగాహన కల్పించి కాన్పులు జరిగే లా చూడాలని డాక్టర్ అహ్మద్‌బాషాకు సూచించారు.

సమయాన్ని పాటించాలి



పొదలకూరు : గ్రామ సచివాలయ సిబ్బంది సమయాన్ని పాటించాలని డీపీఓ సుస్మితారెడ్డి అన్నారు. మండలంలోని మరుపూరు, పొదలకూరు గ్రామ సచివాలయాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. పొదలకూరు బిట్-2 సచివాలయంలో సంక్షేమ పథకాల పోస్టర్లు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పోస్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీపీఓ వెంట ఎంపీడీఓ నగేష్‌కుమారి ఉన్నారు.

బాలాలయ ప్రతిష్ట ఉత్సవాలకు అంకురార్పణ



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని పెద్దూరు లోని కోదండ రామస్వామి ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా టీడీడీ వేదపండితుల ఆధ్వర్యంలో బాలాలయ ప్రతిష్ట ఉత్సవాలకు శుక్రవారం అంకురార్పణ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భూమికి ఆధార్ అనుసంధానం తప్పనిసరి

కొడవలూరు: ప్రతి రైతు భూమికి తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి సూచించారు. కమ్మపాళెం ఆర్‌బీకేలో శుక్రవారం నిర్వహించిన గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. పీఎం కిసాన్, తదితర పథకాల లబ్ధిదారులైన రైతులు మృతి చెందితే వాటిని వారసులు పొందేందుకు ఆధార్ అనుసంధానం ఆవశ్యమన్నారు. అందువల్ల ప్రతి రైతు భూమికి ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. వీఏఏ సుజిత్, రైతులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



వెంకటాచలం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ నాగరాజు హౌసింగ్ అధికారులను ఆదేశించారు. వెంకటాచలం సమీపంలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాల పురోగతిని శుక్రవారం ఆయన పరిశీలించారు. గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. కాలనీలో వంద ఇళ్లకు తగ్గకుండా నిర్మాణాలను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట హౌసింగ్ డీఈ సత్యనారాయణ, ఏఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

చాముండేశ్వరీదేవికి విశేషాలంకారం



ఇందుకూరుపేట: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవికి పసుపు కొమ్ముల అలంకారం, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. పసుపు కొమ్ముల అలంకరణకు రాముడుపాళెనికి చెందిన తోటపల్లి శేషమ్మ కుమారుడు వంశీధర్, కోడలు లహరి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ శాంతయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీమా పథకాలతో ఆర్థిక భరోసా

వెంకటాచలం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలు పేదలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తాయని కసుమూరు ఏపీజీబీ బీఎం బీగాల మణికంఠ పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన చుట్టు సుబ్రహ్మణ్యం కుటుంబానికి రూ.2 లక్షల బీమా పరిహారం చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద ఏడాదికి రూ.436 చెల్లిస్తే పాలసీదారు ప్రమాదవశాత్తు లేదా సహజంగా మరణించినా రూ.2 లక్షల పరిహారం అందుతుందని తెలిపారు. 18 నుంచి 50 ఏళ్ల మధ్యనున్న వారు అర్హులని చెప్పారు. ప్రధాన మంత్రి సురక్ష యోజన కింద ఏడాదికి కేవలం రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల బీమా వర్తిస్తుందని వివరించారు.

నేడు నూతన పింఛన్ల పంపిణీ

కోవూరు: దివంగత సీఎం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా కోవూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు డీఏఏటీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి శుక్రవారం తెలిపారు. కోవూరు మైథిలి సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పిస్తారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



